క్లుప్తంగా

జీవితాలకు దర్పణాలు.. కన్నీటి సంతకం కథలు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జేమ్స్‌వాట్, భద్రం, ప్రతాప్ తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ప్రముఖ కవి, రచయిత, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ కుమార్ రచించిన కన్నీటి సంతకం కథల పుస్తకాన్ని వేదిక అంతర్జాతీయ ప్రతినిధి, పారిశ్రామికవేత్త, ఎన్ఆర్ఐ జేమ్స్‌వాట్ కొమ్ము ఆవిష్కరించారు. నగరంలోని సోన్స్ సాఫ్ట్‌వేర్ కార్యాలయంలో కళావేదిక జాతీయ కో ఆర్డినేటర్ కేతా శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ సినీ హాస్య నటుడు భద్రం మాట్లాడుతూ, ప్రతాప్ కుమార్ రాసిన కథలు ఎందరివో జీవితాలకు దర్పణాలని అన్నారు. ఈ కథలు చదువుతూంటే మనసు ద్రవిస్తుందని, మన చుట్టూ ఉన్న మనుషుల జీవితాల్లోని భావోద్వేగాలను, బాధలను, మానవీయ సంబంధాలను ఈ కథలు కళ్ల ముందు నిలబెడతాయని అన్నారు. జేమ్స్ వాట్ మాట్లాడుతూ, కన్నీటి సంతకం కథలు నేటి జీవన విధానానికి అద్దం పడుతున్నాయన్నారు. కనుమరుగవుతున్న మానవ సంబంధాలు, కుటుంబ అనుబంధాలు, మనిషిలోని ఆర్ద్రత, సమాజంలో చోటు చేసుకుంటున్న మార్పులు ఈ కథల్లో సజీవంగా కనిపిస్తాయని అన్నారు.

రూఫ్ దాటితే.. సేఫ్ కాదు

- కారు సన్‌రూఫ్‌లతో జాగ్రత్త
- అప్రమత్తత లోపిస్తే ప్రాణాలకే ప్రమాదం
- వేలాడే వైర్లు, ఓవర్‌హెడ్ బారికేడ్లతో ముప్పు

రాయవరం: ఆధునిక, లగ్జరీ కార్లకు సన్‌రూఫ్ ఉండాలని పిల్లల నుంచి పెద్దల వరకూ కోరుకుంటున్నారు. కారులో వెళ్తున్నప్పుడు సరదాగా సన్‌రూఫ్ తెరచి.. గాల్లో తేలినట్టు ఆనందంగా ప్రయాణించడాన్ని పలువురు ఆస్వాదిస్తున్నారు. అయితే, ఈ ఆనందం మాటున ప్రమాదం కూడా పొంచి ఉంటుంది. అందువలన సన్‌రూఫ్ తెరచి ప్రయాణించే వారు తప్పనిసరిగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు, రవాణా అధికారులు సూచిస్తున్నారు.

కారు సన్‌రూఫ్‌లో ప్రయాణం

జాగ్రత్తలు తీసుకోవాలి

వేగంగా ప్రయాణించే సందర్భంలో సడన్ బ్రేక్ వేస్తే సన్‌రూఫ్ నుంచి కిందకు పడే అవకాశం ఉంటుంది. సన్‌రూఫ్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి.

-బి.విద్య, ఈస్ట్‌జోన్ డీఎస్పీ, రాజమహేంద్రవరం

ప్రమాదకరం

సన్‌రూఫ్ తెరచుకుని చిన్నారులతో ప్రయాణించడం శ్రేయస్కరం కాదు. ఈ విషయంలో తల్లిదండ్రులే బాధ్యత తీసుకోవాలి. సెల్ఫీ లు, ఫొటోలు కారు పూర్తిగా ఆగిన తర్వాత తీసుకుంటేనే మంచిది.

-ఆర్.సురేష్, తూర్పు గోదావరి జిల్లా రవాణా శాఖ అధికారి

సన్‌రూఫ్ ఎందుకంటే..

- సహజమైన గాలి ప్రసరణ (వెంటిలేషన్) కోసం సన్‌రూఫ్ ఏర్పాటు చేస్తారు.
- అత్యవసర పరిస్థితుల్లో కారు డోర్లు లాక్ అయిపోతే సన్‌రూఫ్ నుంచి బయటకు వెళ్లిపోవచ్చు.
- వేసవిలో ఎండలో నిలిపి ఉంచినప్పుడు కారు క్యాబిన్ చాలా వేడెక్కిపోతుంది. అటువంటి సమయంలో ఏసీ ఆన్ చేసి, సన్‌రూఫ్ తెరిస్తే కారులోని వేడి గాలి బయటకు వెళ్లి, కారు క్యాబిన్ త్వరగా చల్లబడుతుంది.

అజాగ్రత్తగా ఉండే ప్రమాదమే..

- సన్‌రూఫ్‌లలో ప్రయాణం కొన్నిసార్లు ప్రాణాంతకమవుతుంది.
- ఇరుకు, రద్దీ రోడ్లలో ఓవర్ లోడుతో ఎత్తయిన వాహనాలు వెళ్లకుండా పోలీసులు ఓవర్ హెడ్ బారికేడ్లు ఏర్పాటు చేస్తూంటారు. ఇలాంటి రహదారుల్లో సన్‌రూఫ్‌లో నిలబడి ప్రయాణించకూడదు. అలాగే, విద్యుత్ వైర్లు, టీవీ, ఇంటర్నెట్ కేబుళ్లు, ఇతరత్రా సన్నని తీగలు, చెట్ల కొమ్మలు రోడ్లపై వేలాడుతూంటాయి. ఇటువంటి వాటిని డ్రైవర్లు సాధారణంగా ఒక్కోసారి గమనించలేరు. దీంతో, సన్‌రూఫ్‌లో ప్రయాణించే వారికి ఇవి తగిలి మెడ, తల, మొండెం భాగాలకు తీవ్ర గాయాలయ్యే ప్రమాదం ఉంది.
- అలాగే, నడుం భాగం వరకూ బయట పెట్టి చేతులు ఊపుతూ ప్రయాణిస్తున్న క్రమంలో డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే సన్‌రూఫ్‌లో ఉన్నవారికి పట్టు దొరకదు. దీంతో, సన్‌రూఫ్ ఫ్రేమ్ తగిలి పక్కటెముకలు, ఊపిరితిత్తులకు గాయాలయ్యే ప్రమాదం ఉంటుంది. పొత్తి కడుపులో బలంగా తగిలితే తీవ్ర రక్తస్రావం కావచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- వంకలు, మూల వంపులు అధికంగా ఉన్న రోడ్లలో అయితే, ఏకంగా కారులో నుంచి కింద పడిపోయే ప్రమాదం కూడా ఉంటుంది.
- ఇతర వాహనాల నుంచి వెలువడే పొగ, దుమ్ము, ధూళి నేరుగా శ్వాస వ్యవస్థలోకి చేరి రోగాలకు కారణమవుతాయి.

జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీలకు ముగ్గురి ఎంపిక

క్రీడాకారులను అభినందిస్తున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లోని షేర్ కశ్మీర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకూ జరుగుతున్న 29వ జాతీయ స్థాయి సెపక్‌తక్రా సబ్ జూనియర్ బాల బాలికల పోటీలకు జిల్లా నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. గోసంగి సందీప్, బూల అభిషేక్, బీఎస్‌వీ అజిత్ చంటి ఈ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా సెపక్‌తక్రా అసోసియేషన్ అధ్యక్షుడు జవ్వాది తాతబాబు తెలిపారు. ఈ ముగ్గురు క్రీడాకారులను అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. వారు జాతీయ స్థాయి పోటీల్లో విజేతలు కావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన యాండ్ర గౌతమ్, రాష్ట్ర సెపక్‌తక్రా కోచ్ కేతా సతీష్, ఫిజికల్ డైరెక్టర్ బూల చిరంజీవిలను కూడా అభినందించారు.

బ్యాంకు చోరీపై డీఎస్పీ విచారణ

దొంగలు ధ్వంసం చేసిన ఏటీఎంను పరిశీలిస్తున్న డీఎస్పీ కిశోర్ కుమార్

కాజులూరు: గొల్లపాలెంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ)లో జరిగిన చోరీపై కాకినాడ డీఎస్పీ మహంతి కిశోర్ కుమార్ విచారణ చేపట్టారు. రెండు రోజుల కిందట దొంగలు ఈ బ్యాంకులో ఏటీఎం పగులగొట్టి, అందులోని రూ.4,35,500 నగదు చోరీ చేశారు. దీంతో పాటు ఏటీఎం గదికి ఉన్న కిటికీ గ్రిల్ తొలగించి బ్యాంకు లోపలకు ప్రవేశించి, బ్రాంచి మేనేజర్ మొబైల్ ఫోన్‌ను, ఒక డిబ్బీని అపహరించుకుపోయారు. ధ్వంసమైన ఏటీఎంను, బ్యాంకును డీఎస్పీ మంగళవారం పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. బ్యాంకు చోరీపై కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యాన నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశామని, సాధ్యమైనంత త్వరలో నిందితులను పట్టుకుంటామని కిశోర్ కుమార్ చెప్పారు. ఆయన వెంట ఎస్సై ఆర్‌వీఎస్ మూర్తి తదితరులున్నారు.

అమ్మ మీద బెంగతో ఆగిపోయా..

తరుణ్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

మలికిపురం: ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనను అమ్మ మీద బెంగతోనే విరమించుకున్నానని సఖినేటిపల్లిలంక గ్రామానికి చెందిన దారపురెడ్డి తరుణ్ కుమార్ చెప్పాడు. మలికిపురం మండలం దిండి – చించినాడ వంతెన వద్ద అతడు సోమవారం ఉదయం మోటార్ సైకిల్ ఉంచి, దానిపై ఒక లేఖ పెట్టి వెళ్లిపోయిన విషయం తెలిసిందే. దీంతో, తరుణ్ వశిష్ట గోదావరి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడేమోనని అందరూ భావించారు. అతడి కోసం బంధువులు గాలింపు చర్యలు చేపట్టారు. మద్యం తాగి వంతెన కింద పడుకుని ఉన్న అతడిని మంగళవారం తెల్లవారుజామున 2 గంటల తరువాత గుర్తించి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనకు అప్పులున్నాయని తీర్చలేకే ఇలా చేశానని, నదిలో దూకుదామనుకున్న సమయంలో అమ్మ గుర్తుకు వచ్చి, ఆ ప్రయత్నం విరమించుకున్నానని తల్లిదండ్రులు, పోలీసుల సమక్షంలో తరుణ్ చెప్పాడు. పోలీసులు అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

స్కూటర్ డిక్కీలో డబ్బులు మాయం

పెద్దాపురం: స్కూటర్ డిక్కీలో ఉంచిన డబ్బులు మాయమయ్యాయంటూ ఓ వ్యక్తి పెద్దాపురం పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని సిరివాడ గ్రామానికి చెందిన నాగులపల్లి సూర్యనారాయణ పెద్దాపురం మెయిన్ రోడ్డులోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్రాంచిలో గతంలో బంగారు ఆభరణాలు తాకట్టు పెట్టాడు. వాటిని విడిపించుకొనేందుకు మంగళవారం రూ.2,30,000 నగదు తీసుకుని, బ్యాంకుకు వెళ్లాడు. సాంకేతిక కారణాలతో బంగారు ఆభరణాలు విడిపించుకోవడానికి వీలు పడకపోవడంతో తిరిగి ఆ డబ్బును తన స్కూటర్ డిక్కీలో పెట్టి సమీపంలోని తన రూముకు చేరుకున్నాడు. కొద్దిసేపటి తరువాత తిరిగి బ్యాంకుకు వెళ్లేందుకు స్కూటర్ తీయగా డిక్కీలో డబ్బులు మాయమైనట్లు గుర్తించాడు. సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

నేల దున్నితే.. మాకు పండగే..

రైతన్నలు కాడి కట్టి, మేడి పట్టి, నేల దున్నే సమయంలో.. పుడమి తల్లి గర్భంలో ఉన్న రకరకాల పురుగులన్నీ బయట పడుతూంటాయి. సరిగ్గా అదే సమయంలో ఎవరో కబురు చెప్పినట్టు.. ఆ పురుగులను కడుపారా ఆరగించేందుకు ఎక్కడెక్కడో ఉన్న కొంగలు.. రెక్కలు కట్టుకు వచ్చి మరీ వాలిపోతాయి. కోటనందూరు మండలం ఎల్‌డీ పేట వద్ద వరి నాట్లు వేసేందుకు రైతు ట్రాక్టర్‌తో దమ్ము చేస్తూండగా.. వందలాదిగా కొంగలు అలానే తరలి వచ్చాయి. దమ్ము చేస్తున్నంతసేపూ అక్కడే తిష్ట వేసి.. పురుగులను పట్టుకుని కడుపు నింపుకొన్నాయి. 'ఒక జీవికి ఆకలి వేసిందా.. ఇంకో జీవికి ఆయువు మూడిందే' అంటూ ఓ సినీ కవి చంద్రబోస్ తన పాటలో చెప్పిన భావన ఇక్కడ అక్షరాలా ఆవిష్కృతమైంది.

– కోటనందూరు

వ్యాన్ దొంగ అరెస్టు

పట్టుబడిన బొలేరో వాహనంతో సతీష్, కోరంగి పోలీసులు

తాళ్లరేవు: కోరంగిలోని డివైన్ ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన వ్యాన్‌ను దొంగిలించిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. గత నెల 30న మెండా వెంకటేశ్వరరావుకు చెందిన బొలేరో వాహనం అపహరణకు గురైంది. ఈ నెల 8న కోరంగి వంతెన వద్ద నిర్వహించిన తనిఖీల్లో ఆ వాహనాన్ని పోలీసులు గుర్తించి, అందులోని వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని విచారించగా పెద బొడ్డు వెంకటాయపాలెం గ్రామానికి చెందిన పాలెపు సతీష్ ఆ వాహనాన్ని అపహరించినట్లు గుర్తించారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరచి, రిమాండుకు తరలించారు.

అధికారుల దాడి..

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

అయినవిల్లి: అమలాపురంలోని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ (వన్‌స్టాప్) అధికారులు కొట్టి గాయపరిచారంటూ అయినవిల్లి మండలం వెలువలపల్లి గ్రామానికి చెందిన నందిక రమేష్ పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. అతడికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అతడి ముగ్గురు పిల్లలను తీసుకుని అమలాపురంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న తమ కార్యాలయానికి రావాలని చెప్పారు. లేదంటే అరెస్టు చేస్తామని బెదిరించారు. ఈ మేరకు రమేష్ తన పిల్లలను తీసుకుని అక్కడకు వెళ్లాడు. అక్కడ ముగ్గురు మహిళలు తనను తీవ్రంగా తిట్టి, అవమానించారని, నల్లగా ఉన్న ఓ వ్యక్తి తన ఫోన్‌ను బలవంతంగా లాక్కుని తీవ్రంగా కొట్టి గాయపరిచాడని రమేష్ తెలిపాడు. తన ముగ్గురు పిల్లలను బలవంతంగా లాగేసుకున్నారని, నిబంధనలకు విరుద్ధంగా వారిని అడాప్షన్ ఏజెన్సీలో ఉంచారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై అయినవిల్లి పోలీసులకు రమేష్ ఫిర్యాదు చేశాడు. అతడు ప్రస్తుతం అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పోలీసు క్రీడల్లో జిల్లాకు 31 పతకాలు

పతకాలు సాధించిన పోలీసు క్రీడాకారులతో ఎస్పీ రాహుల్ మీనా, ఏఎస్పీ మహేంద్ర తదితరులు

అమలాపురం టౌన్: గుంటూరు నాగార్జున, విట్ యూనివర్సిటీలో ఈ నెల 1 నుంచి నాలుగో తేదీ వరకూ జరిగిన ఏపీ పోలీసు స్పోర్ట్స్, డ్యూటీ మీట్‌లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి 31 పతకాలు సాధించారు. వారిని తన కార్యాలయంలో ఎస్పీ రాహుల్ మీనా మంగళవారం అభినందించారు. జిల్లాకు చెందిన పోలీసు క్రీడాకారులు భవిష్యత్తులో మరిన్ని పతకాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ఏఎస్పీ మహేంద్ర మత్తే, ఏఆర్ డీఎస్పీ సుబ్బరాజు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ షేక్ షాహబాద్ అహ్మద్, స్పెషల్ బ్రాంచి సీఐ వి.పుల్లారావు, అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు, సోషల్ మీడియా సీఐ తమ్మినాయుడు, ఏఆర్ ఆర్ఐ బ్రహ్మానందం, కోటేశ్వరరావు కూడా అభినందించారు.

పతకాలు సాధించారిలా..

- జిల్లా పోలీసు శాఖకు చెందిన 16 మంది అధికారులు, సిబ్బంది వివిధ క్రీడల్లో పాల్గొని 15 బంగారు, 8 వెండి, 8 కాంస్య పతకాలు సాధించారు
- బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి పురుషుల విభాగంలో జిల్లా జట్టు మొదటి స్థానం కైవసం చేసుకుంది.
- జిల్లా మహిళా పోలీసు క్రీడాకారిణులు రాష్ట్ర స్థాయి బాక్సింగ్, హేమర్ త్రోలో మొదటి స్థానాలు, కోకో క్రీడలో రెండో స్థానం సాధించారు.
- ఫొటోగ్రఫీలో రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు.
- పురుషుల విభాగం రాష్ట్ర స్థాయి హాకీలో మూడో స్థానం, కంప్యూటర్ అవేర్‌నెస్ విభాగంలో మొదటి స్థానం సాధించారు.
- బ్యాడ్మింటన్ 50+, 55+ విభాగాల్లో రెండు, వెయిట్ లిఫ్టింగ్‌లో మొదటి, పవర్ లిఫ్టింగ్‌లో మూడు, పురుషుల ఖోఖో, ట్రిపుల్ జంప్, 200 మీటర్ల పరుగు పందేల్లో రెండు, సెపక్‌తక్రాలో మొదటి, ఈత పోటీల్లో మొదటి స్థానాలు సాధించారు.
- ఇంకా సైంటిఫిక్ ఎయిడ్స్ ఇన్వెస్టిగేషన్, వీడియోగ్రఫీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, కబడ్డీ, రెజ్లింగ్, బాక్సింగ్, టెన్నిస్ తదితర క్రీడాంశాల్లో జిల్లా పోలీసు క్రీడాకారులు సత్తా చాటారు.

రూ.7కు కక్కుర్తి.. రూ.7 లక్షలు వదిలింది

కాకినాడ లీగల్/అన్నవరం: అన్యాయంగా ఒకరి సొమ్ము తింటే.. అలా అధర్మంగా సంపాదించిందంతా ఉన్నట్టుండి మాయమైపోతుందని పెద్దలు అంటారు. అన్నవరం దేవస్థానంలోని ఓ వ్యాపారికి సరిగ్గా ఇదే పరిస్థితి ఎదురైంది. వివరాలివీ.. పిఠాపురం మంగయ్యమ్మరావుపేటకు చెందిన డి.వెంకటేశ్వరరావు అనే భక్తుడు ఈ ఏడాది ఫిబ్రవరి 22న అన్నవరం సత్యదేవుని దర్శనానికి వచ్చారు. ఆ సందర్భంగా రత్నగిరిపై దేవస్థానంలోని సత్యదేవ ఫ్యాన్సీ కోకోనట్స్ అండ్ కూల్‌డ్రింక్స్ షాపులో వాటర్ బాటిల్ కొనుగోలు చేశారు. ఆ బాటిల్‌పై గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పీ) రూ.18 ఉండగా, ఆ వ్యాపారి రూ.7 అదనంగా డిమాండ్ చేశాడు. గత్యంతరం లేక వెంకటేశ్వరరావు యూపీఐ ద్వారా రూ.25 చెల్లించారు. దీనిపై ఫిర్యాదు చేసినప్పటికీ దేవస్థానం అధికారులు స్పందించలేదు. ఈ విషయాన్ని అంత తేలిగ్గా వదలకూడదని నిర్ణయించుకున్న ఆయన.. ఈ ఏడాది మార్చి 10న కాకినాడలోని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌ను ఆశ్రయించారు. యూపీఐ ద్వారా చెల్లించిన స్టేట్‌మెంట్, ఇతర ఆధారాలను, సాక్ష్యాలను సమర్పించారు. ఈ కేసును జూన్ 16న విచారించిన కమిషన్.. వెంకటేశ్వరరావు సమర్పించిన ఆధారాలను పరిశీలించింది. అనంతరం, అధికంగా వసూలు చేసిన రూ.7తో పాటు పరిహారంగా రూ.10 వేలు, వ్యాజ్య ఖర్చులు రూ.5 వేలు వెంకటేశ్వరరావుకు చెల్లించాలని ఆ వ్యాపారిని కమిషన్ ఆదేశించింది. దీంతోపాటు కన్జ్యూమర్ వెల్ఫేర్ ఫండ్‌కు 45 రోజుల్లోగా రూ.7 లక్షలు జమ చేయాలని ఆ షాపు యజమానికి ఆదేశాలు జారీ చేసింది. అంతే కాకుండా దేవస్థానం షాపుల్లో ఎంఆర్‌పీ వివరాలతో వెంటనే బోర్డులు ఏర్పాటు చేయాలని కూడా ఆదేశించింది. ఈ మేరకు కమిషన్ అధ్యక్షుడు సీహెచ్ రఘుపతి వసంత కుమార్, సభ్యులు చెక్కా సుశీ, చాగంటి నాగేశ్వరరావు తీర్పు చెబుతూ, గత నెల 28న ఉత్తర్వులు జారీ చేశారని వెంకటేశ్వరరావు మంగళవారం విలేకర్లకు తెలిపారు.

అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ విజేతకు సత్కారం

విలియం కేరీని సత్కరిస్తున్న బొత్స, జగ్గిరెడ్డి, విశ్వరూప్ తదితరులు

కొత్తపేట: అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ చాంపియన్‌షిప్ విజేతగా నిలిచిన ఉండ్రాజవపు విలియం కేరీని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. ఆలమూరు మండలం మడికి గ్రామానికి చెందిన కేరీ గత నెల 24 నుంచి 27వ తేదీ వరకూ భూటాన్‌లో జరిగిన అంతర్జాతీయ గోల్ షాట్ బాల్ పోటీల్లో పాల్గొన్నాడు. ఈ పోటీలో భారత్ జట్టు భూటాన్‌పై విజయం సాధించింది. భారత్ జట్టులో ప్రతిభ చూపి, విజేతగా నిలిచిన విలియం కేరీని రావులపాలెం సీఆర్‌సీలో మంగళవారం జరిగిన వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో జగ్గిరెడ్డి, పార్టీ రీజినల్ కోఆర్డినేటర్, శాసన మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తదితరులు ఘనంగా సత్కరించారు. అతడి తల్లిదండ్రులు రాజామణి, సుందర విజయంలను అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	16,000 – 17,000
కొత్త కొబ్బరి (రెండో రకం)	15,000 – 16,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	24,500
గటగట (వెయ్యి)	22,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	23,500
గటగట (వెయ్యి)	21,000
నీటికాయ	
పాత (ముక్కుడు) కాయ (వెయ్యి)	20,000 – 21,000

మళ్లీ చివరాఖరుకే..

- ప్రభుత్వ సర్వేలో దిగజారిన ర్యాంకు
- అన్నవరం దేవస్థానం.. 66.6 శాతంతో ఆఖరి స్థానం

అన్నవరం: భక్తులకు సేవలు అందించే విషయంలో అన్నవరం దేవస్థానం ర్యాంకు మళ్లీ చివరాఖరుకు దిగజారిపోయింది. రాష్ట్రంలోని సింహాచలం, అన్నవరం, ద్వారకా తిరుమల, విజయవాడ, శ్రీకాళహస్తి, శ్రీశైలం, కాణిపాకం దేవస్థానాల్లో అందిస్తున్న సేవలపై ప్రభుత్వం గత ఆగస్టు 5 నుంచి ఈ నెల 5వ తేదీ వరకూ భక్తుల నుంచి ఐవీఆర్ఎస్, వాట్సాప్ యాప్ సర్వే నిర్వహించింది. ఇందులో 66.6 శాతంతో అన్నవరం దేవస్థానం చివరి స్థానంతో సరిపెట్టుకుంది. ఏకంగా 33.4 శాతం మంది భక్తులు.. అంటే దేవస్థానానికి వచ్చిన ప్రతి ముగ్గురు భక్తుల్లో ఒకరు ఇక్కడి సేవలపై అసంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం. గత ఏడాది ఏప్రిల్‌లో కూడా చివరి స్థానంలోనే నిలిచింది. ఆ సందర్భంగా అప్పటి కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నవరం దేవస్థానంలో తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది అందరూ మెరుగైన సేవలందించడం ద్వారా దేవస్థానాన్ని మొదటి స్థానంలో నిలపాలని ఆదేశించారు. ఆ తరువాత కొంత మెరుగుదల సాధించి, ఒక దశలో మొదటి స్థానానికి చేరింది. ఆ తరువాత 4, 5 స్థానాలకే పరిమితమవుతూ వస్తోంది. దాదాపు ఏడాదిన్నర తరువాత అన్నవరం దేవస్థానం మళ్లీ ఆఖరి స్థానానికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది.

అన్ని దేవస్థానాలపై అసంతృప్తి

సర్వే నిర్వహించిన ఏడు దేవస్థానాల్లో అందిస్తున్న సేవలపై భక్తులు కాస్త అధికంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. దర్శనం సంతృప్తిగా జరిగిందా అనే ప్రశ్నకు గత సర్వేలో 70.8 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేయగా ఈసారి అది 69.8 శాతానికి తగ్గింది. తాగునీటి వసతుల్లో గత సర్వేలో సంతృప్తి శాతం 65.6 శాతం కాగా, తాజాగా 62.7 శాతానికి పడిపోయింది. ప్రసాదాలపై గతంలో సంతృప్తి శాతం 76.9 కాగా ఈసారి 75.1 శాతానికే పరిమితమైంది. పారిశుద్ధ్యంపై గత సర్వేలో సంతృప్తి శాతం 64.4 కాగా, ఈసారి అది 61.4 శాతానికి తగ్గింది.

అన్నవరం దేవస్థానం

బ్యాంక్ ఆఫ్ బరోడా बैंक ऑफ़ बड़ौदा Bank of Baroda ROSARB ప్రాంతీయ కార్యాలయం (రాజమండ్రి)

5వ అంతస్తు, 36-7-14, కొండూరి స్క్వేర్, ఇన్నీస్‌పేట, రాజమండ్రి-533102, ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 0883-2490509, ఇమెయిల్ : sarrjy@bankofbaroda.com

స్థిరాస్తుల విక్రయమునకు అమ్మకం ప్రకటన అనుబంధం IV-A ((రూల్ 6(2) & 8(6) చూడగలరు))

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 6(2) & 8(6) నిబంధనతో చదువబడే విధంగా సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 క్రింది స్థిరాస్తుల అమ్మకానికి -వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకమునకు మరియు ముఖ్యంగా ఋణగ్రహీతలు మరియు హామీదారులకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ వివరించబడిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటార్ గారికి తనఖా / ఛార్జ్‌డ్ చేయబడి బ్యాంక్ ఆఫ్ బరోడా యొక్క అధీకృత అధికారిచే (సెక్యూర్డ్ క్రెడిటార్) స్వాధీనము చేసుకొనబడి ఈ దిగువ చెప్పబడిన ఖాతాలు యొక్క మొత్తములు వసూలు చేసికొనుటకు సదరు స్థిరాస్తులను "ఎక్కడ ఏమి ఉన్నదో అదే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "ఏదైతే ఉన్నదో అదే" ప్రాతిపదికన అమ్మకం జరుపబడును.

ఋణగ్రహీత/లు / తనఖాదారు/హామీదారు/లు/తనఖా చేసిన ఆస్తులు, బకాయిలు/ రిజర్వు ధర/ఇ-వేలం తేది & సమయం, ధరావత్తు మరియు బిడ్ పెంపుదల మొత్తం మొదలగు వివరముల దిగువ తెలుపబడినవి.

1 ఋణగ్రహీత/లు /హామీదారు/ తనఖాదారు/లు : శ్రీ కొమరగిరి శ్రీరామారావు, తండ్రి : ఎమ్.వెంకట వరప్రసాద్ బాబు, డి.నెం.1-146, సెంటర్, హైస్కూల్ దగ్గర, చింతలమోరి, శంకరగుప్తం, మల్కిపురం మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-533250, ఆంధ్రప్రదేశ్, సహ-ఋణగ్రహీత : శ్రీమతి కొమరగిరి విజయలక్ష్మి, భర్త : వెంకట వర ప్రసాద్‌బాబు, డి.నెం.1-146, సెంటర్, హైస్కూల్ దగ్గర, చింతలమోరి, శంకరగుప్తం, మల్కిపురం మండలం, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా-533250, ఆంధ్రప్రదేశ్ (ఖాతా నెం.11600600021135)

మొత్తం బకాయి : రూ.27,20,486/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల ఇరవై వేల నాలుగు వందల ఎనభై ఆరు రూపాయలు మాత్రమే) ప్లస్ తేది.25-05-2026 నుండి వర్తించని వడ్డీ + సర్ఫ్ చేయబడని వడ్డీ, లీగల్ మరియు ఇతర బ్యాంకు చార్జీలు ఏమైనా ఉన్నట్లయితే.

స్థిరాస్తి వివరములు : ఆంధ్రప్రదేశ్, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మల్కిపురం మండలం, రాజోలు యస్ఆర్‌ఓ, శంగరగుప్తం గ్రామం, డోర్ నెం.1-190, ఆర్.యస్.నెం.235/2 లోని 871.20 చ.గ.లు విస్తీర్ణంలోగల రెసిడెన్షియల్ ఆర్‌సిసి రూఫ్ గ్రౌండ్ రెసిడెన్షియల్ భవనము. హద్దులు : తూర్పు : 12 అడుగుల వెడల్పు గల పంచాయతీ రోడ్డు, దక్షిణం: కొమరగిరి వెంకట హనుమ విజయ్ కుమార్ గారి భూమి, పడమర : కొమరగిరి కృష్ణారావు గారి భవనం, ఉత్తరం: కొమరగిరి సత్యసాయి అరుణ్‌కుమార్ గారి భూమి.

స్వాధీనం యొక్క స్థితి : లాంఛనాత్మక స్వాధీనం

రిజర్వు ధర : రూ.42,55,000/- ధరావతు : రూ.4,26,000/- బిడ్ ఇంక్రిమెంట్ ధర : రూ.15,000/-

ఈ వేలం తేది & సమయం : 28-09-2026, సమయం : మధ్యాహ్నం గం. 02-00 ల నుండి సాయంత్రం గం.06-00 ల వరకు వేలం ముగిసే వరకు ప్రతీ 10 నిముషాలకు ఒక్కసారి అన్‌లిమిటెడ్ ఆటో ఎక్స్‌టెన్షన్ ఉండును.

ఆస్తి తనిఖీ తేది మరియు సమయం : 19-09-2026, ఉదయం గం.11.00 ల నుండి మధ్యాహ్నం గం.03.00 ల వరకు

అమ్మకం యొక్క సవివరమైన నియమ నిబంధనల కోసం సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క బ్యాంక్ వెబ్ సైట్ : https://bankofbaroda.bank.in/e-auction మరియు https://baanknet.com లింకును చూడగలరు. ఆసక్తి గల బిడ్డర్లు అధీకృత అధికారి యొక్క మొబైల్ నెం.: 75699 61199 నందు సంప్రదించగలరు.

తేది : 08-09-2026, ప్రదేశం : రాజమండ్రి సం/-అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా

సాక్షి క్లాసిఫైడ్స్

Services

BUSINESS OFFER

We are inviting Franchise Partners In Suven Edu Tech all Districts of A.P. www.suvenedutech.com Contact Cell: 8555075176. [SCA26013986]

GOLD FINANCE

బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్). ✆ 81422 92071 [B-291]

Managers / Asst. Managers in Insurance Company is Above 40 ysr Salary 30K+Others Conta : 90108 09384. [C-1321737]

ఒమెగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంటపని చేయుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ: 20K. Ph: 8977639663/ 8977639662. [HA-796295]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.